వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తా


సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం మైత్రివన్‌కాలనీ వెల్ఫేర్ సొసైటీలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కార్పొరేటర్‌కు కాలనీలోని చిన్నచిన్న సమస్యలు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను వివరించారు. ఆయా సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత తొందరగా సమస్యలను పరిష్కరిస్తానని ఈ సందర్భంగా కార్పొరేటర్ సొసైటీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు జగన్‌రెడ్డి, రామకృష్ణ, హనుమంతరావు, గోపాల్‌రెడ్డి, ఎల్ఎన్ ప్రసాద్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌లోని రామకృష్ణనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఆర్.లక్ష్మి, యూసుఫ్, సంజీవ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాషిపాక నాగమణి, యాదగిరి, మూకయ్య, వెంకటేష్, పరశురాములు, నాగుల మల్లేష్, రాజు తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం 63 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకొని లబ్ధిపొందాలని సూచించారు.

న్యూ ఇయర్ వేడుకలకు అనుమతి తప్పనిసరి

మేడ్చల్ డీసీపీ శబరీష్

కుత్బుల్లాపూర్: అనుమతి లేకుండా నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని మేడ్చల్ డీసీపీ శబరీష్ పేర్కొన్నారు. సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి సూచన మేరకు ఇప్పటికే మార్గదర్శకాలు ఇచ్చామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించిన తర్వాత వారికి అనుమతులు ఇస్తానమి ఆదివారం ఆయన 'సాక్షి'తో తెలిపారు. వేడుకలు జరిగే ప్రాంతంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

◆ మేడ్చల్ జోన్ పరిధిలోని ఏడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. ఇప్పటికే పేట్‌బషీరాబాద్, శామీర్‌పేట్, అల్వాల్, జీనోమ్ వ్యాలీ, మేడ్చల్, సూరారం, దుండిగల్ పోలీస్‌స్టేషన్ల సీఐలు, డీఐలతో సమీక్ష నిర్వహించి పేట్‌బషీరాబాద్, మేడ్చల్ ఏసీపీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎప్పటికప్పుడు వీరు పరిస్థితిని సమీక్షిస్తారని తెలిపారు. గొడవలు జరిగితే వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

'మనూ'లో పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేస్తున్నట్లు ఆదివారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగంలో షమీమాపర్వీన్ పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీని ప్రకటించారు. 'మనూ' కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్(సీటీఈ) సందర్భంగా, సహ పర్యవేక్షణలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మోజాఫర్ ఇస్లామ్ పర్యవేక్షణలో సీటీఈ బీదర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బొందురాజు సహ పర్యవేక్షణలో ఆమె పీహెచ్‌డీని పూర్తి చేశారు. దీనికోసం 'అండర్ స్టాండింగ్ ఆఫ్ ది జియోగ్రాఫికల్ కాన్సెప్ట్స్ ఆమోడ్ ది రిలేషన్ టు కాగ్నిటివ్ ఎబిలిటీస్' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీంతో పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కుల అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ హనుమాన్ నగర్‌కి చెందిన అరుణ అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు మంజూరైన లక్ష రూపాయల చెక్కును ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు రాకపోకలు సాగించేందుకు దారి వదలండి

పంజగుట్ట: ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పి.విజయారెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ శాఖామంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారని అందరూ చుట్టుపక్కన ఉండే బస్తీల్లో పేద కుటుంబాలకు చెందిన వారే ఉన్నారని పేర్కొన్నారు. నిమ్స్ ఆస్పత్రి అభివృద్ధిలో భాగంగా ఎర్రమంజిల్ స్థలం మొత్తం స్వాధీనం చేసుకుందని, ఎవరూ లోనికి వెళ్లకుండా, రాకుండా గేట్లు వేశారని తెలిపారు. అందులోనే ఉన్న ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేవలం నిమ్స్ ఆస్పత్రి లోపలి నుంచి బాలాపూర మీదుగా ఒక్క మార్గమే ఉంచడంతో ప్రధాన రహదారిగుండా విద్యార్థులు నడుచుకుంటూ వస్తూ నిమ్స్ వ్యర్థాల నుంచి పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని, ఈ మార్గంగుండా వస్తే విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. పాఠశాలకు వెళ్లే అన్ని మార్గాలగుండా కేవలం విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు దారి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. దానికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా పాఠశాల కొత్త భవనం నిర్మించి పాఠశాలను తరలించే వరకు విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

'సార్వత్రిక' సన్నద్ధత షురూ

లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై యంత్రాంగం దృష్టి

- పోలింగ్ కేంద్రాల మార్పులపై చర్యలు
- కుటుంబ సభ్యులందరూ ఒకే కేంద్రంలోనే ఓటు వేసేలా కసరత్తు



సాక్షి, మేడ్చల్ జిల్లా: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులతో పాటు కీలకమైన అంశాలపై సంబంధిత అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.

కుటుంబమంతా ఒకేచోట ఓటేసేలా..

ఒక కుటుంబంలో సాధారణంగా మూడునాలుగు ఓట్లు ఉంటాయి. ఉమ్మడి కుటుంబంలో ఈ సంఖ్య రెట్టింపు ఉండొచ్చు. అయితే అక్కడక్కడా కొన్ని కుటుంబాల్లో ఒకరు ఓ పోలింగ్ కేంద్రంలో, వేరొకరు మరో పోలింగ్ కేంద్రంలో ఓటేసే పరిస్థితులు ఉంటున్నాయి. తద్వారా కొంతమంది ఓటేసేందుకు ఆసక్తి చూపించడం లేదని ఎన్నికల సంఘం గుర్తించింది. అందుకే ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. బీఎల్ఏల సహకారం లేదా సాంకేతిక సాయంతో ఈ ప్రక్రియకు పూనుకోవచ్చు. శాసనసభ ఎన్నికలతో పోల్చితే ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశముంది. 2024 సంవత్సరానికి సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితా ఇప్పటికే విడుదలైంది. దీని ప్రకారం జనవరి 6 నాటికి పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. మార్పులుచేర్పులు.. విచారణ అనంతరం తుది జాబితాను ఫిబ్రవరి 8న విడుదల చేస్తారు. మార్చి రెండో వారం వరకు 18 ఏళ్లు నిండిన వారికి ఓటేసే అవకాశం కల్పించే వీలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించాకే..

ఇటీవల శాసనసభ ఎన్నికల సందర్భంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ ఆయా పోలింగ్ కేంద్రాలను మరోసారి పరిశీలించి నివేదిక అందించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ర్యాంపులు, విద్యుత్తు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి సక్రమంగా ఉందో లేదో గమనించాలని సూచించింది. గ్రేటర్‌తోసహా శివారు జిల్లాలలో 29 శాసనసభ నియోజకవర్గాల్లో ఆయా ఎన్నికల నిర్వహణాధికారులు, రెవెన్యూ అధికారులు దీనిపై కసరత్తు మొదలుపెట్టారు. రెండు రోజుల్లో నివేదికను కలెక్టర్లకు అందించనున్నారు.

ప్రస్తుతమున్న పోలింగ్ కేంద్రాలు	
జిల్లా	పోలింగ్ కేంద్రాలు
హైదరాబాద్	3,986
రంగారెడ్డి	3,369
మేడ్చల్-మల్కాజిగిరి	2,397
మొత్తం	9,752

ఓటర్ల కూర్పుపై కసరత్తు

◆ ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల వారీగా గరిష్ఠంగా 1500 వరకు ఓటర్లను చేర్చారు.

◆ మేడ్చల్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో అత్యధికంగా 1490 మంది ఓటర్లున్నారు. అత్యల్పంగా 345 మంది ఓటర్లున్న పోలింగ్ కేంద్రం ఉంది. ఇతర నియోజకవర్గాల్లోనూ ఇదే తరహా పరిస్థితులు కనిపిస్తున్నాయి. మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో చాలాచోట్ల ఓటర్ల సంఖ్య తక్కువగానే ఉంది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఒక పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య గరిష్ఠంగా 1,500 ఉండేలా చూడాలని అధికారులు నిర్ణయించారు. అదే సమయంలో ఓటర్లకు పోలింగ్ కేంద్రం ఎక్కువ దూరం ఉండొద్దని భావిస్తున్నారు. 1,500 మంది కంటే అధిక ఓటర్లుంటే ఆయాచోట్ల రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసే అవకాశాలున్నాయి. ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో ఏదేని పోలింగ్ కేంద్రంలో ఇబ్బందులు తలెత్తినట్లు గుర్తించినా, ఓటర్లకు దూరంగా ఉన్నట్లు ఫిర్యాదులు అందినా నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. మార్పులు చేర్పుల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ క్రైస్తవులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలన్నారు. చర్చీల వద్ద అన్ని రకాల వసతులు కల్పించి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అదే విధంగా క్రైస్తవులకు దుస్తుల పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

పండగ సంతోషంగా జరుపుకోవాలి


పర్వత్‌నగర్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో ఆదివారం మునెమ్మ ఏర్పాటు చేసిన వేడుకల్లో కార్పొరేటర్ సబిహా బేగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ క్రైస్తవుల సమక్షంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలన్నారు.

పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలి

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్


బండి రమేష్‌ను కలిసి ఆయన నాయత్వాన్ని బలపర్చిన కాంగ్రెస్ పార్టీ నాయికులు, కార్యకర్తలు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌కు నాయకులు, కార్యకర్తల నుంచి ఆదరణ పెరుగుతోంది. బాలానగర్‌కు చెందిన మాజీ పీసీసీ కార్యదర్శి సింగజోగి కృష్ణ, కూకట్‌పల్లి మాజీ ఇన్‌చార్జి శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు బండి రమేష్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ ఘనంగా సత్కరించారు.

◆ ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి నాయకుడు, కార్యకర్త శక్తివంచన లేకుండా పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుశెట్టి దినేష్, గంట శ్రీనివాస్‌గౌడ్, రమేష్, రాజేష్‌గౌడ్, స్వరూప, దేవి, రాజేశ్వరి, రాణి నిర్మల, కిరణ్, యోగి, ప్రణవ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ ఉత్సవం


తారకరామ్‌నగర్‌లో జరిగిన వేడుకలో ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్


ఎల్లమ్మబండలో జరిగిన గ్యార్వీ ఉత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలో జరిగిన గ్యార్వీ షరీఫ్ ఉత్సవ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మత సామరస్యానికి ప్రతీక గ్యార్వీ షరీఫ్ ఉత్సవమని అన్నారు. అందరూ సామరస్యంగా జరుపుకునే వేడుక, ఎంతో పవిత్రంగా కొలిచే గ్యార్వీ షరీఫ్ ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ముస్లింలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, కాశీనాథ్‌యాదవ్, ఎల్లం నాయుడు, ఎంఏ. సమద్, ఎంఏ. కరీం, ఎండీ గౌస్, ఖాజా, చాంద్, గౌసుద్దీన్, బడే ఖాజా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

తారకరామ్ నగర్‌లో..

ఎల్లమ్మబండ పరిధిలోని తారకరామ్ నగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సమద్ ఆధ్వర్యంలో ఆదివారం గ్యార్వీ షరీఫ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదానం చేశారు.

అనాథాశ్రమానికి విరాళం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానంద నగర్‌కు చెందిన వెంకట్రావు, శ్రీలతల కుమారుడు మణిసాయి నాయుడు జన్మదినాన్ని శ్రీరాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.15వేల విరాళాన్ని ఆశ్రమానికి అందజేశారు. తన జన్మదినం సందర్భంగా అనాథాశ్రమానికి విరాళం అందజేయడం సంతోషంగా ఉందని మణిసాయి నాయుడు పేర్కొన్నాడు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, కై లాష్, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

నిజాంపేట్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం బాచుపల్లిలో జరిగిన కార్యక్రమంలో సూరారం సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన అమృత్, నారాయణ, శివ, శ్రీనివాస్ రాజు, రామకృష్ణ, కిరణ్, సాయి రామ్ కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరగా వారికి హన్మంతరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు.

సేవల్లో 'స్ఫూర్తి'ప్రదాతలు

ఖైరతాబాద్: విశ్వ మానవ కల్యాణమే ధ్యేయంగా, ఆత్మీయతా సమాజ స్థాపనయే లక్ష్యంగా 83 వసంతాలు మన మధ్య నడయాడిన మహిమాన్వితులు, యుగపురుషులు గురు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో స్ఫూర్తి కుటుంబం సంస్థ ఏర్పడింది. డిసెంబర్ 24న ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఖైరతాబాద్‌లో ఉచిత వైద్య శిబిరం, దుప్పట్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఖైరతాబాద్ శాఖ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఎమ్మెల్యే దానం నాగేందర్ హాజరయ్యారు. సాయంత్రం విశ్వచైతన్య రథయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి సేవాకేంద్రంలో స్ఫూర్తి కుటుంబ తెలంగాణ ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హైకోర్టు రిటైర్డ్ జడ్జి రజని, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ రచయిత్రి శైలజ మిత్ర, దూరదర్శన్ విశ్రాంత ఉద్యోగులు ఎస్.హనుమంతరావు, దూరదర్శన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఓలేటి పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.


స్ఫూర్తి కుటుంబం ద్వితీయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

'గుప్పెడు బియ్యం' కార్యక్రమం అభినందనీయం



హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ


పీఎస్ఎం స్కూల్‌లో జరిగిన సేవా కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ

కూకట్‌పల్లి: స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పీఎస్ఎం పాఠశాల ప్రాంగణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ విచ్చేసి ప్రారంభించారు. స్కూలు విద్యార్థులు 'గుప్పెడు బియ్యం'పేరుతో సేకరించిన బియ్యాన్ని పేదలకు అందజేశారు. 'గుప్పెడు బియ్యం'కార్యక్రమం వినూత్నంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన స్కూల్ యాజమాన్యం, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ మాదవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయకులు హనుమంతరావు, సూర్యప్రకాష్ రావు, అర్శనపల్లి సూర్యారావు పాల్గొన్నారు.

తాగునీరు రోడ్డుపాలు!

- తరచూ తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీల ప్రజలు
- శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

మోతీనగర్: మూసాపేట ఎర్రగడ్డ డివిజన్‌ల మధ్య ఉన్న మోతీనగర్ చౌరస్తా రోడ్డులో ప్రధాన వాటర్ పైప్ లైన్‌కు లీకేజీ ఏర్పడింది. కొన్ని రోజులగా తాగునీరు వృథాగా పోతున్నాయి. మోతీనగర్ చౌరస్తా నుంచి మీసేవ సెంటర్ వరకు... అదే విధంగా మోతీనగర్ చౌరస్తా నుంచి బోరబండ వైపు వాసవీ కమ్యూనికేషన్ వరకు నీరు నిరంతరాయంగా ప్రవహిస్తూనే ఉంది.

◆ అదే విధంగా మోతీనగర్ కమ్యూనిటీహాల్ సమీపంలోనూ ఇదే పరిస్థితి ఉంది. బీఎస్‌పీకాలనీ పరిధిలోని అక్షయ హోటల్ వద్ద తరచూ పైప్ లైన్‌కు లీకేజీలు ఏర్పడుతున్నాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా మళ్లీ లీకేజీలు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కొత్త పైపులైన్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

◆ ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ వెంచర్ 3ప్రధాన రోడ్డులో వాటర్ పైపులైన్‌కు సైతం లీకేజీ ఏర్పడింది. నీరు వృథాగా రోడ్లపై పారుతుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


మోతీనగర్ ప్రధాన రహదారిలో పైప్‌లైన్ లీకేజీతో పారుతున్న తాగునీరు


మోతీనగర్ కమిటీహాల్ సమీపంలోని లీలా ఆస్పత్రి సమీపంలో వృథాగా తాగునీరు

రేపు దత్తజయంతి వేడుకలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో 26న దత్త జయంతి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఆలయంలో షిర్డీసాయిబాబాకు కాకడ హారతితో వేడుకలను ప్రారంభిస్తామన్నారు. అనంతరం 7.30 నుంచి 9 గంటల వరకు షిర్డీసాయిబాబా, వినాయకుడు, దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సాయిసుచరిత్రపారాయణం, 12 గంటలకు మధ్యాహ్న హారతి, అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం వివరించారు.